

కిష్టయ్యకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

## పోలీస్ కిష్టయ్యకు నివాళి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పుట్టకొక్కుల కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) టీఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ పాల్గొని కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించి, టాంక్‌బండ్‌పై విగ్రహం నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు సింగారాపు రామకృష్ణ, నీరటి రాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల నాయకులు అమ్మగారి రాకేశ్‌వర్మ, గోనెల శ్యామ్, ఈరబోయిన రాకేశ్, ఈరబోయిన రోహిత్, దువ్వ దిలీప్, రావుల ప్రశాంత్, అమ్మగారి మోహన్, ఈరబోయిన వినోద్, చేతన్ వర్మ, బోళ్ల శ్యామ్, రావుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



పేద కుటుంబానికి బియ్యం, సామగ్రి అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

## పేద కుటుంబానికి బియ్యం అందజేత

శాయంపేట, డిసెంబర్ 2 : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రాజోలు రాజవీరు నాలుగు రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితులను సూర్యోదయ ట్రస్ట్ చైర్మన్ కనకం జయసూర్యకు కోమనేని రఘు, అమ్మ అశోక్ తెలియజేశారు. దీనికి స్పందించిన ట్రస్టు బాధ్యులు ఆ కుటుంబానికి శనివారం 50 కేజీల బియ్యం, రూ.2వేల విలువగల కిరాణ సామగ్రిని అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

## రైల్వే దేవాలయంలో అన్నదానం

కాజీపేట, డిసెంబర్ 2 : కాజీపేట రైల్వే జంక్షన్ సముదాయంలోని శ్రీ హరిహర పుత్ర శ్రీధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన (భిక్ష) కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అర్చకుడు, గురుస్వామి ఉడుతల శ్రీనివాస్ శర్మ నేతృత్వంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ స్వాములందరికి మండల కాలంలో రోజు దాతల సహకారంతో భిక్షను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన టోకెన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 28 వరకు ఏర్పాటు చేసే ఈ భిక్షను స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు ఓర్సు యాకయ్య, పిల్లల కుమారస్వామి, ఆవాల పురుషోత్తం, అరూరి సాంబయ్య, నటరాజ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, కొండ రాజేందర్, నళినీకాంత్, కోటగిరి సాంబయ్యస్వామి పాల్గొన్నారు.

## 'సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

కాజీపేట, డిసెంబర్ 2 : ఆపద సమయంలో మహిళలు, బాలికలు సఖీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖీ వన్‌స్టాఫ్ కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. కాజీపేట సోమిడిలో సఖీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖీ వన్ స్టాఫ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విడిపోయే భార్యభర్తలను కౌన్సెలింగ్‌తో ఒకటి చేయడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితర వేధింపుల నుంచి రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. 0870-2452112, టోల్ ఫ్రీ నంబర్ 181లో సంప్రదించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, హరిత పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

- పొరపాట్లు జరుగకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి
- కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు మీడియా సెంటర్‌కు అందజేస్తాం
- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్
- కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



కౌంటింగ్ రూంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, డిసెంబర్ 2 : వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని స్ట్రాంగ్ రూంల వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. వివరాలను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని రెండు నియోజకవర్గాలైన పరకాల, వరంగల్ పశ్చిమకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి టేబుల్ వద్ద ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారని అన్నారు. పరకాల నియోజకవర్గానికి 17 రౌండ్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి 18 రౌండ్లు ఓట్లను లెక్కిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్‌తో పాటు, ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి శనివారం రిహార్సల్స్ జరిగాయని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా పత్రికలు, ఇతర ఎలక్ట్రానిక్ మీడియాకు అందజేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కాగా, కౌంటింగ్ సిబ్బందికి శనివారం మార్కెట్ యార్డ్‌లో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొని ఎన్నికల కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలను కౌంటింగ్ సిబ్బంది పాటించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు, ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీడియో, వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అంతరాయం లేకుండా కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్, రమేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, డిసెంబర్ 2 : గ్రేటర్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామానికి చెందిన వడ్డెబోయిన రాజ్‌కుమార్ పోలీసు శాఖలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేస్తున్నాడు. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబాన్ని గ్రామ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. వీరితో పాటు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ స్నేహితులు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.9 వేలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై మండ ఈశ్వరయ్య, కానిస్టేబుళ్లు చింతం ఈశ్వరయ్య, కెత్తే వీరేందర్, భాస్కర్, స్నేహితులు దొంగల రమేశ్, అప్పని సూరి, నర్సింగరావు, ప్రమోద్, శ్రవణ్, కిరణ్, భిక్షపతి, అశోక్, నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.



మొగిలిచెర్లలో హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పోలీసులు, స్నేహితులు

## సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

### మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాగితాల శంకర్

దామెర, డిసెంబర్ 2 : అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నదని పీఆర్‌డీఈ లింగారెడ్డి సభకు తెలిపారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేవని సూపర్‌వైజర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. దుర్గంపేటలో నిర్మించిన వైకుంఠధామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఏఈ గుర్రం రమేశ్‌ను సభ్యులు కోరారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీపీ శంకర్ మాట్లాడుతూ మండలంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కృషితో అనేక అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. గ్రామాల్లో పెండింగ్ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, జడ్పీటీసీ కల్పన, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు సంగనబోయిన మౌనిక, గోవిందు సంధ్య, గండు రామకృష్ణ, ఎంపీవో రంగాచారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, పద్మావతి పాల్గొన్నారు.

## 'పరకాలలో చల్లా ధర్మారెడ్డిదే విజయం'

నడికూడ, డిసెంబర్ 2 : పరకాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిదే హ్యాట్రిక్ విజయం అవుతుందని ఏఎంసీ డైరెక్టర్ పోచంపల్లి రఘుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ స్వయం ప్రకటిత నీటి బుడగలే అని తెలిపారు. మూడొసారీ అధికారంలోకి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, మహానేత సీఎం కేసీఆర్ చేతుల్లోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తన మదిలో కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటూ కారు గుర్తుపై ఓటు వేశారని తెలిపారు. పరకాలలో చల్లా ధర్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు.

## కారు గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

ఆత్మకూరు, డిసెంబర్ 2 : పరకాల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పూజారి రాము పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఓట్లు వేసిన అందరికీ పేరుపేరున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

సంగెం, డిసెంబర్ 2 : ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్లు సంగెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, కోఆర్డినేటర్ జీ రాము తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ దూరవిద్య విధానంలో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకే సంవత్సరంలో ఓపెన్‌లో టెన్త్ లేదా ఇంటర్ చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 99499 39302, 9849 350312 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.